
సాక్షి ఒడిశా

శనివారం। 14। సెప్టెంబర్। 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో బంగారం 9గ్రాముల, 950 మిల్లీ గ్రాములు, వెండి 147 గ్రాముల 200 మిల్లీ గ్రాములు, నగదు రూ.5,00,887లు వచ్చాయని అధికారులు తెలిపారు.



పెదనాన్నపై గొడ్డలితో దాడి

వరుసకు పెదనాన్న అయ్యే వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసిన ఘటన రాయగడ సమితి కుటులి పంచాయతీలోని కుంబికోట గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. - 8లో.



డయేరియా విజృంభణ

మల్కన్‌గిరి జిల్లాలోని మత్తిలి సమితి తులసీ గ్రామం, కుటునిపల్లి పంచాయతీల్లో డయేరియా విజృంభిస్తోంది. - 8లో.

న్యూస్‌రీల్

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చిన్మయ్

రాయగడ: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రైతుల కాలనీలో నవ జీవన్ ట్రస్ట్ అనాథ ఆశ్రమంలో వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 121 మంది విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించారు. గత కొద్ది రోజులుగా జిల్లాలో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పాఠశాలలు, అనాథ ఆశ్రమాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించేందుకు క్లబ్ సన్నహాలు చేస్తోందని క్లబ్ సభ్యులు తెలియజేశారు. పట్టణ అర్బన్ ఆస్పత్రి మెడికల్ అధికారి డాక్టర్ చిన్మయ ప్రసాద్ బెహర పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్య సిబ్బంది రస్మిత దాస్, అనుపమ నాగ్, భాగ్యశ్రీ పురుషోత్తం, కునా మహారాణ తదితరులు సహకరించి విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించారు.

సంజుక్తా సెరికి సత్కారం



సుంజుక్తా సెలిని సత్కరిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: మల్కన్‌గిరి జిల్లా ప్రధాన ఆస్పత్రి నర్సింగ్ అధికారి సంజుక్తా సెలిని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ ప్రత్యేకంగా శుక్రవారం సత్కరించారు. భారత రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ ఏడాది ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సుల అవార్డు పొందిన సందర్భంగా ఈ సత్కారం చేయడం విశేషం.

త్వరలో ఓంఫెడ్ వెండింగ్ మెషిన్లు

భువనేశ్వర్: త్వరలో ఓంఫెడ్ పాల ఉత్పత్తుల వెండింగ్ మెషిన్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు ఓంఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ అమత కులంగే శుక్రవారం ఒక ప్రకటన చేశారు. తొలి దశలో పబ్లిక్ రోడ్లపై వెండింగ్ మెషిన్లను అమర్చేందుకు యోచిస్తున్నట్లు తెలిపారు. అనంతరం భువనేశ్వర్‌లోని వివిధ ప్రాంతాల్లో 20 వెండింగ్ యంత్రాలను ఏర్పాటు చేస్తారు.

ఈనెల 18న సర్వ దర్శనం నిలిపివేత



భువనేశ్వర్: పూరీ శ్రీమందిరంలో రత్న భాండాగారం నిర్వహణ కార్యకలాపాల్లో భాగంగా ఈనెల 18వ తేదీన శ్రీజగన్నాథుని సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు శుక్రవారం ప్రకటించారు. భారత పురావస్తు శాఖ (ఏఎస్‌ఐ) రత్న భాండాగారం నిర్వహణ కార్యకలాపాలు చేపట్టనుంది. ఈ మేరకు ప్రాథమిక తనిఖీ చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా ఆరోజు మధ్యాహ్నం 1 గంట నుంచి సర్వ దర్శనం నిలిపి వేస్తారు. తనిఖీ కార్యకలాపాల సౌలభ్యం కోసం సర్వ దర్శనం నిలిపి వేయబడుతుంది. ఇదిలా ఉండగా ఆరోజు అర్ధ రాత్రి 2 గంటలకు ద్వారాలు తెరిచి, వేకువజాము 3 గంటలకు మంగళ హారతి చేపట్టాలని ఆలయ పాలకవర్గం నిర్ణయించింది.

లింగరాజ్ స్టేషన్ దగ్గర మృతదేహం లభ్యం

భువనేశ్వర్: స్థానిక లింగరాజ్ రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడు స్థానిక యూనిట్ 8 ప్రాంతం నారాయణ మురికివాడకు చెందిన నొబొ నాయక్‌గా గుర్తించారు. స్టేషన్‌కు సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఇనుప కంచెకు తాడుతో కట్టి పడి ఉన్న మృతదేహం కొన్ని గాయాల గుర్తులతో కనిపించింది. నొబొ నాయక్ తన మురికివాడలోని కొంతమందితో గొడవపడి గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడని కుటుంబ వర్గాలు తెలిపాయి. ఎయిర్‌ఫీల్డ్ ఠాణా పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం స్థానిక క్యాపిటల్ ఆస్పత్రికి తరలించారు. సైంటిఫిక్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించింది. నొబొ నాయక్ ఆత్మహత్య చేసుకున్నాడా లేక హత్య చేసి మృతదేహాన్ని రైల్వే స్టేషన్ సమీపంలో పడవేశారా అనేది ఇంకా నిర్ధారించలేదు.

మద్యం అమ్మకాలపై వెనకడుగు



శ్రీమందిరం సింహద్వారం ఆవరణలో ఆందోళన చేస్తున్న దృశ్యం

భువనేశ్వర్: పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు పూరీ బీచ్‌లో పర్యాటకులకు మద్యం అందించే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉపసంహరించుకుంది. పూరీ సాగర తీరంలో మద్యం శిబిరాలు ఏర్పాటు చేసి పర్యాటకులను విశేషంగా ఆకట్టుకోవాలనే యోచనతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త అబ్కారీ విధానాన్ని ఇటీవల ఆవిష్కరించింది. ఈ కార్యాచరణ బాధ్యతలను ఒడిశా రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ (ఓటీడీసీ)కి అప్పగించింది. ప్రభుత్వం కల్పించిన అధికారాలతో ఓటీడీసీ సాగర తీరాల్లో మద్యం శిబిరాలు ఏర్పాటు చేసేందుకు బిడ్లను ఆహ్వానించింది. అయితే ఈ చర్యపై పూరీ గోవర్ధన పీఠాధిపతి స్వామి నిశ్చలానంద సరస్వతి తీవ్రంగా మండిపడ్డారు. పర్యాటక రంగం అభివృద్ధి దృక్పథంతో చతుర్ధామ క్షేత్రంగా పేరొందిన పవిత్ర పూరీ శ్రీజగన్నాథుని క్షేత్రంలో ఇటువంటి చర్యలు సహించలేనివిగా వ్యాఖ్యానించారు. శతాబ్దాల ప్రాచీన శ్రీజగన్నాథ దేవాలయం ముంగిట వివిధ సంస్థలు నిరసన ర్యాలీలు నిర్వహించాయి. బీచ్‌లో మద్యం అమ్మకాల కోసం గుడిసెలు నిర్మించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పూరీ కలెక్టర్ సిద్ధార్థ శంకర్ స్వంయి ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారు. బీచ్‌లో కుటీరాలు ఏర్పాటు చేయడం పూరీ ఆధ్యాత్మిక పవిత్రతకు అవమానకరమన్నారు. జగన్నాథ సంస్కృతికి కళంకం తెస్తుందని మండిపడ్డారు. సముద్ర తీరంలో భజన, కీర్తనలు, సంధ్యా హారతి సమర్పిస్తామని, అక్కడ కలుషితం చేస్తే అంగీకరించేది ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం వెనకడుగు వేసింది. పూరీ మున్సిపాలిటీ పరిధిలో, సామాజిక, మత, సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగిన ఇతర ప్రదేశాల నుంచి 5 కిలోమీటర్ల పరిధిలో మద్యం అమ్మకాలకు ఎటువంటి లైసెన్స్ మంజూరు చేయబడదని అబ్కారీ శాఖ తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది.



భయం.. భయంగా.. బడికి..!

ఈ ఫొటోను గమనించారా.. వీరంతా చదువుకోవడానికి చేస్తున్న సాహసమిది. కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి నందకా గ్రామ పంచాయతీ రంగిణిగుడ సమీప నది వద్ద శుక్రవారం ఈ దృశ్యం కనిపించింది. 30కి పైగా కుటుంబాలు నివసిస్తున్న రంగిణిగుడలో అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల లేవు. దీంతో ఆ గ్రామానికి చెందిన పిల్లలు చదువుకోవాలంటే సమీపంలోని నదిని దాటి రెండున్నర కిలోమీటర్లు నడిచి, మరో గ్రామంలో ఉన్న పాఠశాలకు చేరుకోవాలి. చిన్నారులు రెండున్నర కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లడమే కష్టం కాగా, మార్గమధ్యలో నది దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. వర్షాకాలంలో నదిలో నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఇలాంటి సమయంలో పిల్లలు నది దాటడం ప్రమాదకరమే అయినా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తప్పనిసరిగా వెళ్తున్నారు. అందువలన ఇప్పటికైనా పాలకులు దృష్టి సారించి తమ గ్రామానికి సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

- జయపురం

కామధేను పథకం ప్రారంభం

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కామధేను యోజన అనే కొత్త పథకాన్ని రూపొందించిందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి శుక్రవారం తెలిపారు. పాల ఉత్పత్తి పెంపొందించడం, డెయిరీ సహకార సంఘాలను బలోపేతం చేయడం ఈ పథకం లక్ష్యంగా పేర్కొన్నారు. నగరంలో పశుపోషణ, పాల ఉత్పత్తిపై ఏర్పాటు చేసిన జాతీయ సెమినార్ మాసుమీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మత్స్య, పశుపోషణను ప్రోత్సహించడానికి, చిన్న రైతుల ఆర్థిక వృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారంతో తమ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. పశువుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపరిచేందుకు కామధేను యోజనతో పాటు ప్రాణి సంపద సమృద్ధి యోజన, గోమాత యోజనలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రానున్న 5 ఏళ్లలో రూ.1,423.47 కోట్లతో కామధేను యోజనను అమలు చేస్తుందని చెప్పారు. ఈ పథకం కింద చిన్న డెయిరీ యూనిట్ల స్థాపన, సబ్సిడీపై దూడల దాణా సరఫరా, పశువుల బీమా కవరేజీ విస్తరణ, డెయిరీ సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందని తెలిపారు. పాల సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు, పాల ఉత్పత్తిని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం జాతీయ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ)తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. బరంపురంలో వ్యాక్సిన్ ఉత్పత్తి యూనిట్‌ను, భువనేశ్వర్‌లో అత్యాధునిక ఫీడ్ అనలిటికల్ లాబొరేటరీని ఏర్పాటు చేయడానికి ఎన్‌డీడీబీతో సహకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికుడి దుర్మరణం



సంఘటన స్థలంలో మహేశ్వర్ మృతదేహం

రాయగడ: ముంబాయిలో కూలి పనికి వెళ్లిన రాష్ట్రానికి చెందిన కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. మృతుడు జిల్లాలోని కాసీపూర్ సమితి కుచేయిపాదొరొ పంచాయతీ కుచేర్ గ్రామానికి చెందిన మహేశ్వర్ జొడియా (21)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. రెండు నెలల క్రితం మహేశ్వర్ తోటి స్నేహితులతో కలిసి పొట్టకూటి కోసం ముంబాయి వెళ్లాడు. ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా ఒక కాంట్రాక్టర్ వద్ద పనికి చేరిన అతడు గురువారం ఒక ఇంటి నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యాడు. పై అంతస్తులో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోవడంతో సంఘటన స్థలం వద్దే మృతి చెందాడు.

ఈ సమాచారం మృతుని కుటుంబీకులకు గురువారం రాత్రి తెలిసింది. దీంతో వారు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న మహేశ్వర్ కుటుంబీకులు ముంబాయి నుంచి మృతదేహాన్ని ఇక్కడికి తీసుకొచ్చే స్తోమత లేకపోవడంతో జిల్లా కార్మిక శాఖ అధికారికి మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు సహకరించాలని కోరారు. ఈ మేరకు స్పందించిన అధికారి అందుకు సన్నాహాలు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా గత కొద్ది నెలలుగా ఇటువంటి తరహా సంఘటనలు నిత్యం చేసుకుంటుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న రాయగడ జిల్లాలో పనులు లభించకపోవడంతో, పొట్ట చేతపట్టుకుని ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లి తిరిగి శవాలు మాత్రమే వస్తున్న యువత భవిష్యత్ ఆందోళనకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వందే భారత్ ట్రయల్ రన్



ట్రయల్ రన్‌లో భాగంగా రాయగడ చేరుకున్న రైలు

రాయగడ: రాష్ట్రం మీదుగా త్వరలో మరో మూడు వందే భారత్ రైళ్లు పరుగులు తీయనున్న నేపథ్యంలో శుక్రవారం రాయగడ మీదుగా ఒక వందే భారత్ రైలు ట్రయల్ రన్ నిర్వహించారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ రైళ్లలో ప్రయాణించడం కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నవారికి, ఈనెల 17వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా వీటిని ప్రారంభించనున్నారు. రాయగడ మీదుగా ప్రయాణించే ఈ రైలు ట్రయల్ రన్‌లో భాగంగా ఇక్కడికి చేరుకోవడంతో రైలును చూసేందుకు ఎంతోమంది ఆసక్తిగా స్టేషన్‌కు వెళ్లారు. రాయిపూర్ - విశాఖ, రౌర్కెలా - హవుడా, టాటానగర్ - బరంపురం మార్గాల్లో మూడు వందే భారత్ రైళ్లు రాయగడ మీదుగా ప్రయాణించనున్నాయి. ఇదిలా ఉండగా ఈ రైళ్లను జిల్లాలోని మునిగుడలో నిలపాలని డిమాండ్ చేస్తూ మునిగుడ వాసులు శుక్రవారం మునిగుడ రైల్వే స్టేషన్ మాస్టర్‌కు ఒక వినతిపత్రం అందజేశారు.

కోళ్ల పెంపకంపై తాత్కాలిక నిషేధం



భువనేశ్వర్: రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ తీవ్ర కలకలం రేపుతోంది. పూరీ జిల్లాలో ఈ పరిస్థితి మొదట తలెత్తగా, క్రమంగా కేంద్రాపడా తదితర పరిసర ప్రాంతాలకు వ్యాపించింది. పూరీ జిల్లాలో బర్డ్ ఫ్లూ ప్రభావిత ప్రాంతాల్లో కోళ్ల పెంపకంపై పశు సంవర్ధక శాఖ తాత్కాలికంగా మూడు నెలల నిషేధం విధించింది. పిప్పిలి, డెలాంగ్, నిమ్మాపడా, సత్యబాది ప్రాంతాల్లో ఈ నిషేధం వర్తిస్తుందని విభాగం మంగళవారం స్పష్టం చేసింది. ప్రభావిత ప్రాంతాలకు 1 కిలో మీటరు పరిధిలో కోళ్ల పెంపకం నిషిద్ధమని సంబంధిత వర్గాలు తెలిపాయి. బర్డ్ ఫ్లూ వ్యాప్తి నివారణ చర్యగా 10 కిలోమీటర్ల పరిధిలో కోళ్ల రవాణా అనుమతించబడదు. సంక్రమణ, వ్యాప్తి కట్టడి కార్యాచరణలో భాగంగా ఈ ఆంక్షలు విధించడం గమనార్హం. ఈ ప్రాంతాల నుంచి కోళ్ల నమూనాలు ప్రతీ 15 రోజులకు ఒకసారి పరీక్షిస్తారు. హెచ్5 ఎన్1 వైరస్ కనుగుంటే అదనపు చర్యలు అమలు చేస్తారని ముందస్తుగా తెలియజేశారు. అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తారు. కాలానుగుణంగా పరిస్థితిని సమీక్షించి తాజా కార్యాచరణ జారీ చేస్తారు. బర్డ్ ఫ్లూ వ్యాప్తిని అరికట్టడానికి చేసిన ప్రయత్నాల్లో భాగంగా మత్స్య మరియు పశు వనరుల విభాగం పిప్పిలి మండలం 861 పౌల్ట్రీ ఫామ్‌లలో 55, డెలాంగ్ మండలం 344 ఫామ్‌లలో 64 ఫామ్‌లు ఇప్పటికే సీల్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి స్థానిక అధికారులు హెచ్5 ఎన్1 వ్యాప్తిని అరికట్టేందుకు విస్తృతంగా కోళ్లను చంపడానికి దారితీసిన విషయం తెలిసిందే.

అక్రమ బంగారం పట్టివేత

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర వాణిజ్య పన్నులు (సీటీ), ద్రవ్య సేవా పన్ను (జీఎస్టీ) అధికారులు శుక్రవారం ఒక ప్రయాణికుడి నుంచి సుమారు 24 కిలోల గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దీనిలో నాలుగు కేజీల బంగారానికి సంబంధించిన చెల్లుబాటు పత్రాలను అందించడంలో సంబంధిత వ్యక్తి విఫలమవడంతో ఆభరణాలను సీజ్ చేశారు. లాజిస్టిక్స్ కంపెనీ ద్వారా మూడు ప్యాకెట్లలో సరుకు రవాణా జరుగుతోంది. రవాణాదారు పన్ను ఇన్‌వాయిస్, ఇతర పత్రాలను సమర్పించడంలో విఫలమైనట్లు జీఎస్టీ అధికారి తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 26న సైతం స్థానిక విమానాశ్రయంలో ఓ కంటైనర్ వాహనంలో సుమారు 50 కిలోల బంగారం, 200 కిలోల వెండి ఆభరణాలను పన్ను అధికార వర్గాలు స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

దోపిడీ కేసులో నిందితుల అరెస్టు



అరెస్టైన నిందితులు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, బొమ్మ తుపాకీ, సెల్‌ఫోన్లు

రాయగడ: ఒక దోపిడీ కేసుకు సంబంధించి చందిలి పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో కాసీపూర్ సమితి టికిరపడ గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ మాఝి, గోరక్‌పూర్ గ్రామానికి చెందిన శివశంకర్ నాయక్, బడమర్రి భట్ట గ్రామానికి చెందిన కృష్ణ నాయక్‌లు ఉన్నారు. నిందితుల నుంచి రూ.90 వేల నగదు, 4 సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక పదునైన కత్తి, మరో బొమ్మ తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌డీపీవో రస్మీరంజన్ నాయక్ ఈ కేసు వివరాలను చందిలి పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో శుక్రవారం వెల్లడించారు. జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌కు చెందిన బొనమాలి రత్నాలు అనే వ్యక్తి భారత్ ఫైనాన్స్ కంపెనీలో ఏరియా మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బ్యాంకు ద్వారా ఫైనాన్స్ చేసిన వ్యక్తుల నుంచి రుణ నగదును వసూలు చేసేందుకు ఈనెల 9వ తేదీన వెళ్లాడు. తమలాబడి, అలుబడి, తర్లాబడి తదితర గ్రామాల్లో ఖాతాదారుల నుంచి వసూలు చేసిన రూ.1,72,000ల నగదును బ్యాంకులో జమ చేసేందుకు తీసుకెళ్తుండగా తర్లాబడి కూడలిలో నలుగురు దుండగులు బొమ్మ తుపాకీ, కత్తిని చూపించి భయపెట్టి సుకాంత కుమార్ నగదు ఉంచిన బ్యాగును లాక్కొని వెళ్లారు. దీనిపై బాధితుడు చందిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్నారు. అనంతరం నిందితులను కోర్టుకు తరలించారు.

దొంగల ముఠా గుట్టురట్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్డీపీవో వర్మ తదితరులు

జయపురం: సెల్‌ఫోన్లు దొంగలిస్తున్న అంతరాష్ట్ర దొంగల ముఠా గుట్టును జయపురం పోలీసులు రట్టు చేశారు. ఈ మేరకు వివరాలను సబ్ డివిజన్ పోలీసు అధికారి అంకిత కుమార్ వర్మ శుక్రవారం వెల్లడించారు. ఈనెల 6, 7 తేదీల్లో స్థానిక దైనిక బజారు పరిసర ప్రాంతాల్లో 14 సెల్‌ఫోన్లు దొంగతనానికి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసేందుకు ఎస్‌ఐ మహంతి నేతృత్వంలో ఒక టీమ్ ఏర్పాటు చేశారు. ఈ బృందం దర్యాప్తులో పలు విషయాలు తెలిశాయి. ఆ లింకులు అనుసరించి ఝార్సుగుడ వెళ్లి అక్కడ ఒక అద్దె ఇంటిపై దాడి చేసి నిందితులను పట్టుకున్నారు. ఆ ఇంట్లో 50 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే జార్ఖండ్ రాష్ట్రం సాహబగంజ్ జిల్లా బాబుపూర్‌కు చెందిన విశాలకుమార్ మహత, హరికుమార్ మహత, ఉత్తమ తురి, పశ్చిమ బంగాకు చెందిన ఇద్దరు మైనర్లను అరెస్టు చేశారు.

బంగ్లాదేశ్‌కు తరలింపు

నిందితులను పోలీసులు తమదైన శైలిలో విచారించగా పలు వివరాలు బయటపడ్డాయి. వారు ఈనెల 6వ తేదీన ఝార్సుగుడ రైలులో జయపురం వచ్చి ఒక లాడ్జిలో ఉన్నారు. తాము బట్టల వ్యాపారులం అని పరిచయం చేసుకున్నారు. అనంతరం ప్యాంట్ వెనుక జేబుల్లో సెల్‌ఫోన్లు పెట్టుకునేవారిని టార్గెట్ చేసి, రెండు రోజుల్లో 14 ఫోన్లు దొంగలించి ఝార్సుగుడ వెళ్లిపోయారు. అనంతరం ఫోన్ల నుంచి సిమ్‌లను తొలగించి, వాటిని ఝార్సుగుడలో ఒక ముఠాకు తక్కువ ధరకు అమ్మివేశారు. ఫోన్లు కొన్నటువంటి ముఠా పశ్చిమ బెంగాల్ మీదుగా వాటిని బంగ్లాదేశ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అయితే బంగ్లాదేశ్‌లో ఎవరు వీరితో డీల్ చేస్తున్నది తెలియడం లేదన్నారు. గతేడాది కాళీ పూజ సమయంలోనూ నిందితులు జయపురంలో సెల్‌ఫోన్లు దొంగిలించారని తెలిపారు. 3 ఏళ్ల నుంచి దాదాపు 3 వేల ఫోన్లు దొంగలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో పట్టణ పోలీసు అధికారి రమణీరంజన్ దొళాయి, ఎస్‌ఐ సిద్ధార్థ కుమార్ బెహర తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న పోలీసులు

క్లుప్తంగా

పట్టుబడిన యువకుడు

పర్లాకిమిడి: స్థానిక కొత్త బస్టాండ్ వద్ద శుక్రవారం ఉదయం ఒక యువకుడు మోకానికల్ షెడ్డులో హైడ్రాలిక్ జాకీలు, బస్సు జాయింట్లు దొంగిలిస్తుండగా మెకానిక్ మిశాల్ సంతోష్ కుమార్ పట్టుకుని విద్యుత్ స్తంభానికి కట్టివేశాడు. కొద్దిరోజుల క్రితం కూడా యువకుడు ఇనుప రాడ్లు, బస్సు యంత్ర సామాగ్రి దొంగలించినట్లు సంతోష్ కుమార్ చెబుతున్నాడు. పట్టుబడిన యువకుడు స్థానిక ఒకటో వార్డు రాంనగర్‌కు చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. పోలీసుస్టేషన్‌కు ఆ యువకుడిని తరలించి ప్రశ్నిస్తున్నారు.

పాముకాటుతో యువకుడు మృతి



రఘునాథ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి చితపరి గ్రామంలో పాముకాటుతో యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. చితపరి గ్రామానికి చెందిన రాఘునాథ్ ముదిలి (23) శుక్రవారం ఉదయం పొలంలో ఎరువులు వేయడానికి వెళ్లాడు. అయితే ఆ సమయంలో కాలికి ఏదో కుట్టినట్లు అనిపించి వెనక్కి చూస్తే విషసర్పం ఉంది. దీంతో వెంటనే ఇంటికి వచ్చి తండ్రి హరిచంద్ర ముదులికి విషయం తెలియజేశాడు. వెంటనే కుటుంబ సభ్యులు స్పందించి బలిమెల ఆరోగ్య కేంద్రాలనికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ 11 గంటల సమయంలో రఘునాథ్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బలిమెల ఐఐసీ ధీరజ్ పట్నాయక్ ఆరోగ్య కేంద్రానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

చెరువులో పడి యువకుడి మృతి



సనతాన్ గోమాంగో మృతదేహం

పర్లాకిమిడి: మోహనా సమితి లుహాగుడి పంచాయతీ కార్యాలయం వెనుక చెరువులో శుక్రవారం ఉదయం ఒక యువకుడు కాలుజారి మృత్యువాతపడ్డాడు. మృతి చెందిన బాలుడు లుహాగుడి గ్రామానికి చెందిన బలిమా గోమాంగో కుమారుడు సనతాన్ గోమాంగో (17)గా పోలీసులు తెలియజేశారు. ఘటనపై లుహాగుడి పీఎస్‌లో కేసు నమోదు చేశారు.

గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితుడు

రాయగడ: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఒక వ్యక్తిని గుడారి పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. అతడి నుంచి 29.200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించారు. ఎప్పటిలాగే పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా గుడారి కూడలిలో బైకుపై వస్తున్న ఒక వ్యక్తిని ఆపి, వాహనం వెనుక ఉన్న బస్తాను తనిఖీ చేయగా అందులో గంజాయి పట్టుబడింది.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న పది మందిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పట్టణంలో రైల్వేస్టేషన్ సమీపంలో బీఆర్ నగర్‌లోని ఓ ఇంటిలో గంజాయిని నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు తెలిసింది.



ర్యాలీలో పాల్గొన్న గిరిజనులు

కదం తొక్కిన గిరిజనులు



ర్యాలీ ప్రారంభిస్తున్న గిరిజన నేత లక్ష్మ కావాసి

మల్కన్‌గిరి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో గిరిజనులు కదం తొక్కారు. దీనిలో భాగంగా స్థానిక బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గత ఆరేళ్లగా 234 గ్రామ సభలు నిర్వహించి అటవీ వనరులపై హక్కులు డిమాండ్ చేస్తూ జిల్లాస్థాయి కమిటీకి పలుమార్లు వినతులు ఇచ్చిన పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు తమకు అటవీ భూహక్కుల పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్‌లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వినతి పత్రాన్ని కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్‌కు అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకుడు లక్ష్మకావాసి తదితరులు పాల్గొన్నారు.

ఏడు రోజుల్లో నివేదిక



స్వామివారి మహా ప్రసాదాలు

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ దేవస్థానంలో స్వామికి నివేదించే అన్న ప్రసాదాలు భక్తులకు మహా ప్రసాదం. మట్టి పాత్రల్లో వండి వార్చడం విభిన్నత. ఈ సంప్రదాయం ఉల్లంఘనకు పాల్పడి ఇనప మూకుడులో వండిన పదార్థాలు విక్రయిస్తున్నట్లు దృష్టికి వచ్చింది. ఈ విషయమై శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి(సీఏఓ) డాక్టర్ అరవింద పాఢి సత్వర చర్యలకు ఆదేశించారు. స్వామి ప్రసాదాలు ఉన్న ఇనుప మూకుడుని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై విచారణ ముగించి 7 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సువార్ మహాసువార్, రోష పాయికా నియోగ్, రోష అమీన్‌కి ఈ ఆదేశాలు జారీ చేసినట్లు సీఏవో పేర్కొన్నారు. పట్టజోషి మహాపాత్రో, తొలుచ్చొ మహాపాత్రో, దెవులొ కొరాణొ వర్గీయులు పోటు (వంట గది)లో పర్యవేక్షించనున్నారు.

‘సుభద్ర యోజన విజయవంతమవ్వాలి’



సుభద్ర యోజనపై చర్చిస్తున్న త్రిపాఠి పక్కనే కుహరో తదితరులు

రాయగడ: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తీసుకొచ్చిన సుభద్ర యోజన పథకం విజయవంతమయ్యేలా అధికారులు శ్రద్ధ వహించాలని ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి ఉమేష్ చంద్ర త్రిపాఠి సూచించారు. సుభద్ర యోజన పథకంపై వివరాలు సేకరించేందుకు ప్రత్యేకంగా రాయగడ విచ్చేసిన ఆయన స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో అధికారులతో శుక్రవారం సమావేశమయ్యారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో, ఏడీఎం భాస్కర రైతా తదితర జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి నుంచి సుభద్ర యోజన పథకం అమలయ్యేలా చూడాలన్నారు. సుభద్ర యోజన పథకం దరఖాస్తులు నింపడం, ఫారం అప్‌లోడ్ చేయడం వంటి పనులపై సమీక్షించారు. అదేవిధంగా పథకంపై పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేయలన్నారు.

‘సుభద్ర’ రథానికి దరఖాస్తులు అందజేత



అవగాహన రథం వద్ద గిరిజన మహిళలు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి బోండతెగ మహిళలు సుభద్ర యోజన దరఖాస్తులను తమ గ్రామాలకు వచ్చిన సుభద్ర రథానికి శుక్రవారం అందజేశారు. ఖోయిర్‌పూట్ సమితి పరిధి ముదిలిపోడ, ఆంద్రహాల్, పర్కన్‌పల్లి, రస్‌బేడ, కదంగూడ పంచాయతీలకు చెందిన 5,584 మంది మహిళలు దరఖాస్తులు అందించారు.

మల్కన్‌గిరి సమితిలోని తమ్సా, కలిమెల సమితిలోని భపాన్‌పల్లి, తాండబాయి, మత్తిలి సమితిలోని తేమురపల్లితో పాటు పలు ప్రాంతాల్లో రథం తిరుగుతూ పథకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది.

పల్లెలపై విష జ్వరాల పంజా

ఇచ్ఛాపురం రూరల్: శివారు గ్రామమైన డొంకూరులో జ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రస్తుతం గ్రామంలోని ప్రతి వీధిలో పది మంది వరకు జ్వర పీడితులు ఉండగా, అందులో చిన్నారులు అధికంగా ఉన్నారు. ఇదే గ్రామానికి చెందిన పొన్నగంటి సీతమ్మ అనే మహిళ విష జ్వరంతో బాధపడుతూ ఈనెల 4న మృతి చెందింది. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీరు నిల్వ కావడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా వైద్య సదుపాయాలు అంతగా లేకపోవడంతో సంచి వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా వైద్య సిబ్బంది స్పందించి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి రక్త పరీక్షలు నిర్వహించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

నందికొండలో డెంగీ కలకలం

సరుబుజ్జిలి: మండల కేంద్రానికి సమీపంలోని నందికొండ కాలనీ మంచం పట్టింది. సుమారు 25 మంది విష జ్వరాలతో బాధపడుతుండగా, పెరుమాళ్ల అప్పారావు, చెల్లమ్మలు తీవ్ర జ్వరంతో స్థానిక ప్రాథమిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎల్ఎన్‌పేట వసతి గృహంలో 8వ తరగతి చదువుతున్న నందికొండకాలనీకి చెందిన పట్నాన వేణుశ్రీ డెంగీ లక్షణాలతో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఇటీవల బాలిక వసతి గృహంలో ఉన్నప్పుడు జ్వరం రావడంతో స్వగ్రామానికి వచ్చి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయగా డెంగీ నిర్ధారించారని సిబ్బంది తెలిపారు. వెంటనే వైద్యాధికారి సంతోష్‌కుమార్ స్పందించి తమ సిబ్బందితో కాలనీలో ఉన్న అందరి రక్తనమూనాలు పరీక్షించారు. స్థానికంగా ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

దిశా కమిటీ సభ్యుల నియామకం

రాయగడ: దిశా కమిటీలో కొత్త సభ్యులను ఆ కమి టీ చైర్మన్, కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉలక శుక్రవారం ప్రకటించారు. సభ్యులుగా నియమితు లైన వారిలో పద్మపూర్ సమితిలోని నైరా పంచాయతీకి చెందిన తులస సబర్, గుణుపూర్ సమితి టొల న పంచాయితీలోని సంతోషి సబర్, బిసంకటక్ సమితిలోని నమితా కులిసిక, కాసీపూర్ సమితి టికిరిలోని జగబంధు మాఝి, రాయగడ సమితిలోని బడ అలుబడికి చెందిన గీతా సరక, అదేవిధంగా శక్తి స్వచ్ఛంద సేవా సంస్థకు చెందిన అఖిల్ పండ, న్యాయవాది బసంతకుమార్ పెద్దింటి, నంది గౌరిలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి పటబొంధొ గ్రామ సమీపంలోని మలుపు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు గాయాలు పాలయ్యాడు. రవుతొపపొరాడిగుడ గ్రామానికి చెందిన పవిత్ర కద్రక అతని బైకుపై కల్యాణ సింగుపూర్ నుంచి ఇంటికి తిరిగి వెళ్తుండగా బైక్ అదుపుతప్పి ప్రమాదం జరిగింది. దీంతో అతడిని కల్యాణ సింగుపూర్ ఆస్పత్రిలో చేర్పించారు.

భార్యాభర్తలకు గాయాలు

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రగాయాలకు గురైన ఘటన కల్యాణ సింగుపూర్ సమితి కొరప పంచాయతీలోని కృష్ణపాత్రోగుడ వద్ద గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో గాయాలు పాలైనవారు బిసంకటక్‌లోని ధమునిపొంగ గ్రామానికి చెందిన సుభాష్ కౌసల్య, అతని భార్య దేవకి కౌసల్యగా గుర్తించారు. ద్విచక్ర వాహనంపై ధమునిపొంగకు వెళ్తున్న సమయంలో కృష్ణపాత్రోగుడ సమీపంలోని సీతాలమ్మ మందిరం వద్ద బైకు అదుపుతప్పడంతో ప్రమాదం జరిగింది. తీవ్ర గాయాలకు గురైనవారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

ఇద్దరు వ్యక్తులను ఢీకొన్న పోలీసు వాహనం

భువనేశ్వర్: ఇద్దరు వ్యక్తులను ఢీకొన్న పోలీసు వాహనం కాలువలోకి దూసుకెళ్లింది. కటక్ నగరం బిజూ పట్నాయక్ వీధిలో శుక్రవారం ఉదయం ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో చెప్పులు కుట్టే వ్యక్తి మరియు ఒక సైక్లిస్ట్ గాయపడ్డారు. వీరిని ఢీకొన్న పోలీసు వాహనం డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వాహనాన్ని, డ్రైవర్‌ను రక్షించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పెదనాన్నపై గొడ్డలితో దాడి



దాడిలో గాయపడిన గాంధీ మినియాక

రాయగడ: వరుసకు పెదనాన్న అయ్యే వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసిన ఘటన సదరు సమితి కుటులి పంచాయతీలోని కుంబికోట గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. తీవ్రగాయాలకు గురైన క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. శుక్రవారం గాంధీ గ్రామ సమీపంలో ఆవులను మేపుతున్నాడు. అయితే ఇదే అదనుగా భావించిన తన తమ్ముడు కొడుకు నాగమినియాక గొడ్డలితో పలుమార్లు దాడి చేశాడు. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి వెళ్లి రక్తపు మడుగులో పడివున్న గాంధీని వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే తన పెదనాన్నపై ఎందుకు దాడి చేశాడు అనే విషయం తెలియాల్సి ఉంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు చేస్తున్నారు. దాడి చేసిన నాగ మినియాక పరారీలో ఉన్నాడు.

బోల్తాపడిన ట్రక్కు



ప్రమాదానికి గురైన వాహనం

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి నంగలపకు ఘాట్ రోడ్డులో గురువారం సాయంత్రం ఇనుప రాడ్లు తీసుకెళ్తున్న ట్రక్కు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ట్రక్కు రాయిఘర్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ప్రమాదం సంభవించింది. ట్రక్కులో డ్రైవర్ చిక్కుకున్నాడు. స్థానికులు డ్రైవర్ చిక్కుకున్న విషయం గుర్తించి బొయిపరిగుడ పోలీసులకు తెలియజేశారు. అనంతరం 5 గంటలకు పైగా కష్టపడి డ్రైవర్‌ను బయటకు తీశారు. డ్రైవర్ చేతికి గాయమవ్వడంతో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేశారు.

కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల ధర్నా



గజపతి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్ వద్ద గజపతి జిల్లా రాయఘడ, పర్లాకిమిడి జర్నలిస్టులు నిరవధిక ధర్నాకు శుక్రవారం దిగారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 5వ తేదీన రాయఘడ సమితి పెగ్గడ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో పిల్లలకు అందిస్తున్న గుడ్ల పంపకంలో హెచ్ఎం సంధ్యారాణి పోరిచ్చా అవినీతికి పాల్పడుతున్నట్టు ముగ్గురు విలేకరులు న్యూస్ చేశారు. దీంతో ఆమె రాయఘడ పోలీసుస్టేషన్‌లో సదరు విలేకరులపై కేసు పెట్టింది. ఈ మేరకు స్టేషన్ ఇన్‌చార్జి రీనా రాయ్ సాహు ముగ్గురు విలేకరులను స్టేషన్‌కు పిలిచి విచారించారు. దీంతో నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపించి, బాధిత విలేకరులకు రక్షణ కల్పించాలని కోరుతూ జర్నలిస్టులు ధర్నా చేపట్టారు.

డయేరియా విజృంభణ



చికిత్స పొందుతున్న గెమ్మ హిరావియా



మత్తిలి ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న మహిళలు

- రెండు రోజుల్లో ఐదుగురు మృతి

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి తులసీ గ్రామం, కుటునిపల్లి పంచాయతీల్లో డయేరియా విజృంభిస్తోంది. ఈ రెండు గ్రామాల్లో గత రెండు రోజుల్లో ఐదుగురు మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. వరదలు అనంతరం ఈ గ్రామాల్లోని ప్రజలు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. దీనిలో భాగంగా కుటునిపల్లికి చెందిన సనదేయి కటియా(45), కమలా నాయిక్ (30)లు గురువారం మృతి చెందారు. ఈ విషయం తెలియడంతో మత్తిలి ఆరోగ్య కేంద్రం నుంచి ఒక వైద్య బృందం ఆయా గ్రామాల్లోకి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించింది. దీనిలో భాగంగా 15 మందికి వ్యాధి నిర్ధారణ చేసి ఆరోగ్యం కేంద్రంలో చికిత్స అందజేస్తున్నారు. కాగా శుక్రవారం తేమురుపల్లి పంచాయతీ తులసి గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన తండ్రీ, ఇద్దరు పిల్లలు మృతి చెందారు. వీరిలో చిన్ను దురువ (49), పార్వతి దురువ (19), రమేష్ దురువ (15)లు ఉన్నారు. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న నళిని

రాయగడ: స్థానిక రైతుల కాలనీలోని వన జీవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలైన 40 మంది ఆదివాసీ వృద్ధ మహిళలకు పప్పు, బియ్యం, నూనె, బంగాళదుంపలు, ఉల్లి తదితర నిత్యావసర వస్తువులు శుక్రవారం పంపిణీ చేశారు. తమ ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతీ నెల నిరుపేదలైన ఆదివాసీ వృద్ధ మహిళలకు నిత్యావసరాల వస్తువులను పంపిణీ చేస్తున్నామని ట్రస్టు నిర్వాహకురాలు ఎం.నళిని తెలియజేశారు.


‘పోలీసులు అన్యాయంగా కొట్టారు’

టెక్కలి/టెక్కలిరూరల్: పోలీసులు తనను అన్యాయంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి విచక్షణారహితంగా కొట్టారని ఆరోపిస్తూ టెక్కలికి చెందిన ఇల్లా గురుప్రసాద్ అనే యువకుడు శుక్రవారం టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం చేరాడు. బాధిత యువకుడు తెలిపిన వివరాలు ప్రకారం... ఓ వివాహితను వేధి స్తున్నానంటూ ఆ కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇచ్చారనే కారణంతో తరచూ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి కొడుతున్నారని యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఎప్పటిలాగే శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి ఇద్దరు పోలీసులు బూట్లతో తన్నారని, ఏమవుతుందోనని భయంతో పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు పరుగులు తీశానని, ఈ లోగా తన తండ్రి చక్రపాణి చూసి ఆస్పత్రికి తీసుకువెళ్లారని యువకుడు తెలిపాడు. యువకుడు ఇచ్చిన వివరాలతో ఆస్పత్రి సిబ్బంది ఎంఎల్‌సీ నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌కు పంపించారు. అయితే పోలీస్‌స్టేషన్‌లో తిరస్కరించినట్లు ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. దీనిపై టెక్కలి సీఐ విజయకుమార్ మాట్లాడుతూ టెక్కలికి చెందిన ఓ వివాహితను యువకుడు వేధిస్తున్నాడనే ఫిర్యాదు మేరకు స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేస్తుండగా బయటకు పరుగులు తీశాడని వెల్లడించారు. ఎంఎల్‌సీ విషయమై మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు ఎంఎల్‌సీ వివరాలు తీసుకువచ్చే సమయానికి సిబ్బంది భోజనాలకు వెళ్లడంతో అందుబాటులో లేరు తప్ప తిరస్కరించలేదన్నారు.



ఆ'వేదన..

శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే రోడ్డులో వాహనదారుల కష్టాలు నానాటికీ పెరుగుతున్నాయి. మొన్న కురిసిన వానలకు రోడ్డు గుంతల మయం కావడంతో భారీ వాహనాలు ఇరుక్కుపోయాయి. ఈ పరిస్థితి నుంచి తమను బయటపడేయాలని వాహనదారులు కోరుతున్నారు. – శ్రీకాకుళం రూరల్



కిలోమీటరు దూరంలో నిలిచిన ట్రాఫిక్ (ఇన్‌సెట్) పొక్లెయిన్‌తో వాహనాలను బయటకు లాగుతున్న దృశ్యం

గోతుల్లో కూరుకుపోయిన లారీలు

ప్రజా పోరాట యోధుడు సీతారాం ఏచూరి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రజా పోరాటాలను నిర్మించడమే సీతారాం ఏచూరికి మనం అర్పించే నివాళి అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అన్నారు. ప్రముఖ పోరాట యోధుడు, సీపీఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, 12 ఏళ్ల పాటు రాజ్యసభ సభ్యుడిగా సేవలు అందించిన కామ్రేడ్ సీతారాం ఏచూరికి సీఐటీయూ జిల్లా కమిటీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తోందని అన్నారు. కామ్రేడ్ సీతా రాం ఏచూరికి నివాళులర్పిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సంతాప సభలు నిర్వహించాలని సీఐటీయూ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం చిలకపాలెం సమీపంలో గల నాగార్జున అగ్రికెం పరిశ్రమ వద్ద సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011లో పైడిభీమవరంలో డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ కార్మికుల 100 రోజుల సమ్మె సందర్భంగా సీతారాం ఇక్కడకు వచ్చారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యం, సెక్యులరిజం పరిరక్షణకు జరిగిన పోరాట ఉద్యమాల్లో ఏచూరి పాత్ర అద్భుతమైనదని అన్నారు.

క్లుప్తంగా

పీసా ఎన్నికలు నిర్వహించండి



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని 41 పంచాయతీల్లో పీసా ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్‌శంకరన్ సమావేశ మందిరంలో గ్రామ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈనెల 24 నుంచి వచ్చేనెల 8 వ తేదీలోపు 102 గ్రామసభలు పెట్టాలని, అలాగే పీసాచట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, ఎంపీడీవో గీతాంజలి, తహసీల్దార్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన బియ్యం పరిశీలన



పట్టుబడిన బియ్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి మధుసూదనరావు

చీపురుపల్లి: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడుల్లో పట్టుబడిన 37,600 కేజీల బియ్యాన్ని జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి మధుసూదనరావు చీపురుపల్లిలో శుక్రవారం పరిశీలించారు. మెరక ముడిదాం మండలంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాలశాఖ సంయుక్తంగా గురువారం జరిపిన దాడుల్లో 37,600 కేజీలు బియ్యం పట్టుబడ్డాయి. ఆ బియ్యాన్ని సీజ్ చేసి చీపురుపల్లి ఎంఎల్ఎస్ గొడౌన్‌లో అప్పగించారు. ఈ బియ్యాన్ని పరిశీలించిన ఆయన జాగ్రత్తలు తీసుకోవాలని గొడౌన్ ఇన్‌చార్జికి సూచించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ పిన్నింటి రామారావు ఉన్నారు.

298 మద్యంసీసాల పట్టివేత



మాట్లాడుతున్న సీఐ నారాయణ రావు

బాడంగి: మండలంలోని రావివలస చెరువు ప్రాంతంలో పోలీసులు కాపుకాసి ఇద్దరు వ్యక్తులనుంచి 298 మద్యం బాటిల్స్ పట్టుకున్నారు. దీనిపై బొబ్బిలి సీఐ నారాయణరావు శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్థానిక ఎస్సైకి వచ్చిన సమాచారం మేరకు మండలంలోని రావివలస చెరువువద్ద గురువారం రాత్రి కాపుకాసి మోటార్ సైకిల్‌పై వస్తున్న వాడాడకు చెందిన రవ్వా శంకరరావు, రెడ్డిరాఘవరావులను తనిఖీచేయగా 298 క్వార్టర్ మద్యం సీసాలుగా పట్టుబడినట్లు తెలిపారు. దీంతో మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక మాగార్డెన్ సమీపంలో సుజుకీ షోరూం పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. డయల్ 100కి వచ్చిన సమాచారంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా మృతిచెందిన వ్యక్తి సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయసు కలిగి ఉన్నాడని, అక్కడ విచారణ చేయగా మృతుడి గురించి ఎటువంటి సమాచారం లభించలేదన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

నదిలో పడి ఎద్దుల మృతి

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి ఆధారమైన జోడెద్దులు గోస్తనీ నది గోతిలో పడి ప్రాణాలు వదిలాయి. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ధర్మవరపు కోటరావు రోజూ మాదిరిగా ఇసుక కోసం బండిని నదికి తోలాడు. బండికి ఇసుక నింపిన తర్వాత ఒడ్డుకు వచ్చేందుకు బండి తోలుతున్న సమయంలో ఒకేసారి రెండు ఎద్దులు అకస్మాత్తుగా గోతిలో పడిపోయాయి. నదిలో నీటిప్రవాహం ఉండడంతో గోతిలో చిక్కుకుపోయి ఊపిరాడక ప్రాణాలు వదిలేశాయి.

పండగలకు ప్రత్యేక రైళ్లు

విజయనగరం టౌన్: దసరా, దీపావళి పండగల నేపథ్యంలో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వే సీనియర్ డీసీఎం కె.సందీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్ 07487 సికింద్రాబాద్-శ్రీకాకుళం రోడ్డు ఏసీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ అక్టోబరు 2వ తేదీ నుంచి నవంబరు 6వ తేదీ వరకూ ఆరు ట్రిప్‌లు నడుస్తుందని, అదే విధంగా రైలు నంబర్ 07488 శ్రీకాకుళం రోడ్డు – సికింద్రాబాద్ స్పెషల్ ట్రైన్ అక్టోబరు 3 నుంచి నవంబరు 7వరకూ ఆరు ట్రిప్పులు తిరుగుతుందని పేర్కొన్నారు. సికింద్రాబాద్ నుంచి శ్రీకాకుళం వరకు గల అన్ని స్టేషన్లలో రైలు ఆగుతుందని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హిందుస్థాన్ హమారా

- ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించే జాతీయభాష
- రోజురోజుకు హిందీ భాష పట్ల పెరుగుతున్న ఆదరణ
- నేడు జాతీయభాషా దినోత్సవం



హిందీ దివస్

రాజాం: దేశ ప్రజలను ఏకం చేసే, ఏకతాటిపైకి తెచ్చే మహత్తర మాధ్యమం జాతీయ భాష హిందీ. దాదాపు 3,372 పైగా భాషలను దేశ ప్రజలు మాట్లాడుతుండగా..వాటిలో 24 అధికార భాషలను గుర్తించినప్పటికీ..జాతీయ భాషగా హిందీనే భావిస్తున్నాం. దేశంలో హిందీ భాషను మాట్లాడేవారు, అర్థం చేసుకునేవారు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. 1949 సెప్టెంబర్ 14న భారత రాజ్యాంగంలోని 343వ అధికరణం దేవనాగరి లిపిలోని హిందీని అధికార భాషగా గుర్తించింది. నాటినుంచి ఏటా సెప్టెంబర్ 14న హిందీని జాతీయ భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ నేపథ్యంలో హిందీ దివస్‌కు సంబంధించి మరిన్ని వివరాలు.

ఉపాధి..ఉద్యోగావకాశాలు..

హిందీ భాషను నేర్చుకున్నవారికి, అందులో డిగ్రీ పట్టా పొందినవారికి ఉపాధి, ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి. కేంద్ర సాయుధ బలగాల్లో చేరేందుకు హిందీ భాషలో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. రైల్వే ఉద్యోగాలు పొందే వారిలో ఎక్కువమంది హిందీ భాషపై పట్టు ఉన్నవారే కనిపిస్తున్నారు. ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ్, విద్వాన్ వంటి కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు సివిల్ సర్వీసులతో పాటు డిగ్రీ తత్సమాన పోటీ పరీక్షలు, ఉద్యోగ పరీక్షలకు అర్హులుగా గుర్తింపు పొందుతున్నారు.



హిందీ దివస్ ఉత్సవాల్లో విశ్రాంత హిందీ భాషోపాధ్యాయులకు సత్కారం (ఫైల్)

విశిష్ట సేవలు అందిస్తున్న ప్రచారక్‌లు..

ఇప్పుడు హిందీ భాషపైన, ఆవశ్యకతపైన ప్రజల్లో అవగాహన కలిగింది. ఫలితంగా అన్ని ప్రాంతాల్లో హిందీ ప్రచారక్‌లు ముందుకు వచ్చి హిందీ ప్రాథమిక స్థాయి పరీక్షల నుంచి ఉన్నత స్థాయి పరీక్షల కేంద్రాలు ఏర్పాటుచేసి విద్యార్థులను తయారు చేస్తున్నారు. పూర్తి సమయం కాకుండా కొంత సమయాన్ని కేటాయించి గృహిణులు, ప్రైవేట్ ఉద్యోగులు ఈ కోర్సులు పూర్తిచేసి, అనంతరం ప్రభుత్వ కొలువులు పొందుతున్నారు. జిల్లాలోని పెనుబాక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో హిందీ ప్రచారక్ కె. మధుసూధనరావు ఇటు విజయనగరం, అటు శ్రీకాకుళం జిల్లాలోని విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించి, ప్రతి ఏటా వందలాదిమంది విద్యార్థులను తయారు చేస్తున్నారు.



పెనుబాక పాఠశాలలో హిందీ ప్రచార సభ పరీక్షల్లో విద్యార్థులు (ఫైల్)

వారోత్సవాలు..

హిందీ దివస్ సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 14న హిందీ భాషా దినోత్సవం నిర్వహిస్తారు. హిందీ ప్రచారక్‌లు ఉన్న కేంద్రాల్లో వారోత్సవాలు, పక్షోత్సవాలు నిర్వహించి ర్యాలీలు చేయడంతో పాటు ప్రజలకు హిందీ భాషపై అవగాహన కల్పిస్తారు. హిందీ భాష అభివృద్ధికి కృషిచేసిన హిందీ భాష సాహితీవేత్తలు, కవులతో పాటు రిటైర్డ్ ఉపాధ్యాయులను సత్కరిస్తారు.

హిందీ భాషతో ఉపాధి..



హిందీ భాష చాలా మందికి ఉపాధి కల్పిస్తుంది. పది, ఇంటర్ తరువాత హిందీ సబ్జెక్ట్‌గా తీసుకుని డిగ్రీ చేయడం, తర్వాత హిందీ పండిట్ శిక్షణ పొంది మంచి ఉద్యోగాలు సాంపాదిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో హిందీ బోధనోపాధ్యాయులకి మంచి డిమాండ్ ఉంది. హిందీ భాషకు సంబంధించి ప్రస్తుతం ట్యూషన్ సెంటర్లు కూడా పెట్టి చాలా మంది ఉపాధి పొందుతున్నారు. మా ప్రచారక్ కేంద్రం వద్ద ప్రతి ఏడాది 120 మందికి పైగా కొత్త విద్యార్థులు దక్షిణభారత హిందీ ప్రచార సభ మద్రాస్ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత చెంది పట్టాలు పొందుతున్నారు.

– కె. మధుసూదనరావు, హిందీ ప్రచారక్, రాజాం

ఇలా మొదలైంది..

మనదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో హిందీ మాతృభాషగా ఉంది. అలా అని అక్కడ హిందీ ఒక్కటే లేదు. దాంతో పాటు మరికొన్ని ఇతర భాషలు కూడా ఉన్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఒడిశా, పంజాబ్, బెంగాల్, కశ్మీర్ రాష్ట్రాల వారికి ప్రాంతీయ మాతృభాషలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వెళ్లినప్పుడు భాషా సమస్య ఉత్పన్నమైంది. బ్రిటిష్ పాలనా కాలంలో ఇంగ్లీషును స్కూల్స్‌లో బోధించారు. దీంతో అన్ని రాష్ట్రాల ప్రజలను ఏకం చేసే భాషగా అప్పట్లో ఇంగ్లీషు వెలుగొందింది. ఇది దేశానికి స్వాతంత్ర్యం రాకముందు ముచ్చట. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక..ప్రభుత్వ కార్యకలాపాలను జాతీయ స్థాయిలో నిర్వహించడానికి ఏ భాషను వాడాలి? అనే ప్రశ్న తెరపైకి వచ్చింది. దీనిపై దేశ జాతీయ నాయకుల మధ్య జరిగిన చర్చల ఫలితంగా 1949 సెప్టెంబర్ 14న హిందీని అధికార భాష గా నిర్ణయించారు. ఎన్నో మలుపుల మధ్య భారత రాజ్యాంగం లోని 343వ అధికరణం దేవనాగిరి లిపిలోని హిందీని అధికార భాషగా గుర్తించింది. ఆ కారణంగా నాటి నుంచి ఆంగ్ల భాష అధికార హోదాను కోల్పోయింది. హిందీ భాషకు పట్టంకట్టారు. నాటి నుంచి సెప్టెంబర్ 14న జాతీయ హిందీ భాషా దినోత్సవం జరుపుకుంటున్నాం.

ఎన్నో విశేషాలు

- హిందీ ..అనే పదం పర్షియన్ భాషలోని హింద్ నుంచి వచ్చింది. హింద్ అంటే సింధు నది ప్రవహించే నేల అని అర్థం.
- 11వ శతాబ్ద కాలంలో టర్కీ పాలకులు మన దేశంపై దండయాత్రకు వచ్చినప్పుడు హింద్ అనే పదాన్ని ఉపయోగించినట్లు చరిత్ర పరిశోధకులు చెబుతుంటారు.
- నేపాల్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఫిజీ, మారిషస్, సురినామ్, కెనడా, అమెరికా, దక్షిణాఫ్రికా, ఉగాండా, ట్రినిడాడ్, న్యూజిలాండ్ ఇలా అనేక దేశాల్లో హిందీ మాట్లాడే వారు అధిక సంఖ్యలో ఉన్నారు.
- ప్రపంచ వ్యాప్తంగా 180కిపైగా విశ్వ విద్యాలయాల్లో హిందీ భాషకు సంబంధించిన అధ్యయనాలు, పరిశోధనలు జరుగుతున్నాయి.

ప్రపంచ భాషల్లో మూడో స్థానం

- ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా మాట్లాడే భాషలను జనాభాపరంగా పరిశీలిస్తే ఇంగ్లీషు, చైనీస్ భాషల తర్వాతి స్థానం హిందీదే.
- టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో వెబ్ అడ్రస్‌లు రూపొందించడానికి ఉపయోగిస్తున్న ఏడు భాషల్లో హిందీ కూడా ఒకటి.
- 1968లో సుమిత్రానందన్ పంత్‌కు హిందీ సాహిత్య సేవలకు గానూ జ్ఞానపీఠ్ పురస్కారం లభించింది.
- 1982లో హిందీ సాహిత్యంలో జ్ఞానపీఠ్ పురస్కారం పొందిన తొలి మహిళగా మహాదేవి వర్మ నిలిచారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలి

- జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు



టెన్నికాయిట్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ టెన్నికాయిట్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు ఉత్తమ ప్రతిభాపాటవాలు కనబరిచి విజేతలుగా నిలవాలని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపికల్లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లా పలాసలో జరగనున్న అంతర్ జిల్లాల సబ్‌జూనియర్స్ బాల,బాలికల పోటీల్లో జిల్లా క్రీడాకారులు విజేతలుగా నిలిచి విజయనగరం కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పాలని కోరారు. ఎంపిక పోటీలను టెన్ని కాయిట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.రామారావు, స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.కృష్ణంరాజు, పీడీలు కె.గోపాల్, బంటుపల్లి శివ, మీసాల శ్రీనివాసరావు, మజ్జి తిరుపతి రావు, లక్ష్మీశేఖర్, సత్యనారాయణలు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురం ఆర్అండ్‌బీ రహదారి మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలలోకి వెళ్తే..పూసపాటిరేగ మండలం రోలుచప్పిడి గ్రామానికి చెందిన కొయ్య రమణ(30) పనినిమిత్తం బైక్‌పై విజయనగరం వెళ్లి తిరిగి వస్తుండగా గోవిందపురం మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య వైష్ణవి ఉంది. మృతదేహాన్ని సుందరపేట ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పూసపాటిరేగ ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

విజయనగరం క్రైమ్: ఒడిశా నుంచి తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న నిందితుడిని జీఆర్‌పీ సిబ్బంది శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తి దగ్గర నుంచి 5 కిలోల 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్‌పీ ఎస్సై వి.బాలాజీరావు తెలిపారు. గంజాయి తరలిస్తున్న నిందితుడు ఆనంద సెల్వన్‌దొరైను అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం విశాఖ రైల్వే కోర్టుకు పంపించామని చెప్పారు.

గంజాయి అమ్ముతున్న ఐదుగురి అరెస్ట్

విజయనగరం క్రైమ్: గంజాయి అమ్మకాలు చేస్తున్న ఐదుగురు నిందితులను స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుకున్న వారిలో ఒడిశాకు చెందిన బెహరా సంతోష్‌కుమార్, విజయనగరంలోని శాంతినగర్‌కు చెందిన వాసుపల్లి విజయ, బూర్లిపేటకు చెందిన బోడసింగి లోహిత్, గాజులరేగకు చెందిన కె.చందులతో పాటు మరో జువైనల్ ఉన్నారని పేర్కొన్నారు.

యోగా పోటీలకు జిల్లా జట్టు సిద్ధం

- నేటి నుంచి భీమిలిలో రాష్ట్రస్థాయి పోటీలు



రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న యోగా పోటీలకు విజయనగరం జిల్లా జట్టు సిద్ధమైంది. జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని బాలాజీనగర్‌లో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 50 మంది క్రీడాకారులు హాజరు కాగా వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు అవనాపు విక్రమ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14, 15వ తేదీల్లో విశాఖ జిల్లా భీమిలిలోని సన్ స్కూల్‌లో జరగనున్న సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో యోగా పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శనతో పతకాలు సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.సన్యాసిరావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు, కోచ్‌లు బి.యశోద, ఆర్. రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

పోలమాంబను దర్శించిన కలెక్టర్



వనంగుడిలో అమ్మవారిని దర్శించుకుంటున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజన దేవత శంబరపోలమాంబ అమ్మవారి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శంబర గ్రామంలో కొలువైన పోలమాంబ అమ్మవారి వనంగుడి, చదురుగుడిలను శుక్రవారం ఆయన సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను సాదరంగా స్వాగతించగా, వేదపండితులు అమ్మవారికి కలెక్టర్‌తో ప్రత్యేక పూజలు చేయించి ఆశీర్వచనాలు అందజేశారు.

ఆలయ అభివృద్ధిపై సమీక్ష

పోలమాంబ అమ్మవారి పండగ వచ్చేఏడాది జనవరి నెలలో జరగనుంది. ఈ మేరకు జాతరకు వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముందుగానే అధికారులు, గ్రామపెద్దలు, దేవాదాయశాఖ అధికారులతో ఆలయ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు.

పెండింగ్ నిధుల మంజూరుకు చర్యలు

తన పర్యటనలో భాగంగా వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్‌ను, సువర్ణముఖినది రెగ్యులేటర్ గేట్లను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పరిశీలించారు. ప్రాజెక్ట్ ఆధునికీకరణకు అవసరమైన పనులపై ఈ సందర్భంగా ఆరా తీశారు. పెండింగ్ నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఆర్.గోవిందరావు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: గంట్యాడ మండలంలోని మధుపాడ గ్రామంలో జరిగిన హత్యకేసులో నిందితుడ్ని అరెస్టు చేసి , రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఈ నెల 11న బుధవారం రాత్రి వినాయక నిమజ్జనం కార్యక్రమం సందర్భంగా అర్ధరాత్రి సమయంలో నిందితుడు పాటూరి సాయిరామ్ చెల్లికి, మృతుడు చెల్లంనాయుడు (35)ల మధ్య వివాహేతర సంబంధం విషయంలో ఉన్న పాత గొడవలు మనసులో పెట్టుకుని, చెల్లంనాయుడికి నిందితుడు సాయిరామ్ మద్యం పట్టించి, పీక నులిపి, కిందపడేశాడు. తర్వాత దగ్గరలో ఉన్న బరువైన సిమెంట్ ఇటుక దిమ్మెను చెల్లంనాయుడి తలపై మూడుసార్లు పడేయడంతో చెల్లంనాయుడు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఈ సమాచారం మేరకు డీఎస్పీ గోవిందరావు, సీఐ రామకృష్ణ, క్లూస్ టీమ్ సభ్యులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆధారాలు సేకరించారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు.

పశుబీమాలోనూ.. ‘పచ్చ’పాతం..!

- పరిమితంగా పశు బీమా పథకం
- తెలుగు తమ్ముళ్లకు చెందిన పశువులకే తొలి ప్రాధాన్యం
- గతంలో పార్టీలకు అతీతంగా అన్నిరకాల సంక్షేమం
- కూటమి ప్రభుత్వం పరిమితులు, షరతులతో పథకాలకు కోత
- కేవలం 976 యూనిట్ల క్లైయిమ్‌లే లక్ష్యం
- లబోదిబోమంటున్న పాడి రైతులు, జీవాల పెంపకందారులు



ఆవు చెవికి వేసిన పశుబీమా పథకం ట్యాగ్

రాజాం: ప్రభుత్వం మారింది.. ప్రతీ పథకానికి పేరు మారింది. యూనిట్లలో కోత.. లబ్ధిదారుల కుదింపు ప్రక్రియ మొదలైంది. గత ప్రభుత్వం కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ఐదేళ్ల పాటు పాలన సాగించింది. ప్రతినెలా ఏదో ఒక సంక్షేమ పథకాన్ని పార్టీలతో సంబంధంలేకుండా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా డీబీటీ విధానంలో లబ్ధి సమకూర్చింది. ఇప్పుడొచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలులో జాప్యంతో పాటు పరిమితులు, షరతులు విధిస్తూ పార్టీ విధేయులకు పథకాలు అందించే పనిలో పడింది. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు ఇంకా ఆచరణకు నోచుకోలేదు. రైతుకు పెట్టుబడి సాయం, మత్స్యకార భరోసా, తల్లికివందనం వంటి పథకాల లబ్ధి అందక లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. తాజాగా పాడి రైతులు, జీవాల పెంపకందారులకు అండగా నిలిచే పశుబీమా పథకాన్నీ కొన్నియూనిట్లకే పరిమితం చేసింది. ఆ యూనిట్ల అమలులో కూడా ‘పచ్చ’పాతం చూపుతోందంటూ పాడిరైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

జిల్లాలో పశుసంపద ఇలా..

పాడిఆవుల సంఖ్య	4లక్షలు
గేదెలు	2 లక్షలు
జీవాల సంఖ్య (గొర్రెలు, మేకలు)	3.88 లక్షలు పైబడి

పలుకుబడి ఉన్నవారికే..

కొత్త ప్రభుత్వం పాడి పశువుల బీమా పథకం పంచాయతీల్లో టీడీపీలో బాగా పలుకుబడి ఉన్నవారికి మాత్రమే లభించే పరిస్థితి ఉంది. మూడు సంవత్సరాల కాలపరిమితితో కూడిన ఈ ఇన్సూరెన్స్ పథకం ద్వారా రూ.15 వేలు, రూ. 30 వేల బీమా అందించేందుకు రైతుల పాడి ఆవులకు ట్యాగ్‌లు వేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 80 శాతం రాయితీతో, ఇతరులకు 50 శాతం రాయితీతో బీమా అసలు నగదు చెల్లించాల్సి ఉంది. అన్ని పశుసంవర్ధక శాఖలు ద్వారా ఈ కార్యక్రమం గ్రామాల్లో అర్హులైన రైతులకు అందించాల్సి ఉండగా, బీమా ఉందన్న విషయం కూడా బయటకు తెలియనీయకుండా అధికారపార్టీకి చెందిన కార్యకర్తల పాడి ఆవులకు పశుసంవర్ధకశాఖ సిబ్బంది ట్యాగ్‌లు వేసి ఇన్సూరెన్స్ చేస్తున్నారు. దీంతో ఈ బీమా పథకంపై పాడి పరిశ్రమలపై ఆధారపడి, పెట్టుబడులు పెడుతున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలానికి 27 పాడి ఆవులకు మాత్రమే..

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 4 లక్షలకు పైగా పాడి ఆవులు, 2 లక్షల వరకు బర్రెలు, 3.88 లక్షల వరకూ గొర్రెలు ఉన్నాయి. వీటిలో అర్హత ఉన్న పాడి ఆవులు, గొర్రెలు, బర్రెలకు బీమా పథకం వర్తింపజేసి ఆపద వేళ రైతులను ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కూటమి ప్రభుత్వం మండలానికి కేవలం 27 పాడి ఆవులకు మాత్రమే ఆపదవేళ క్లైమ్‌చేయించుకునే నిబంధన తెచ్చింది. ఈ ప్రాతిపదికన ఒక్కో మండలంలో ఒక్కో పంచాయతీలో ఒక్క రైతుకు మాత్రమే బీమా వర్తించే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా కేవలం 976 యూనిట్లను లక్ష్యంగా చేసుకుని బీమాను కొత్త ప్రభుత్వం తెరమీదకు తీసుకొచ్చింది. ఆ అవకాశం కూడా టీడీపీ వర్గానికి చెందినవారికే కల్పిస్తుండడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

బీమా గురించి అసలు తెలియదు..



పాడి పశువుల బీమా అమలు జరుగుతుందనే విషయం మా పంచాయతీలో ఏ రైతుకు తెలియదు. మా పంచాయతీలో వందల సంఖ్యలో పాడి ఆవులు, గొర్రెలు, మేకలు ఉన్నాయి. ఈ పథకం పంచాయతీకి ఒక్కరికే వర్తింపజేసేలా నిబంధన పెట్టడం విచారకరం. మాలో మాకే గొడవలు వచ్చేలా ఉన్నాయి. ఆపవేళ ఆదుకునే పథకంలో కోతపెట్టడం ప్రభుత్వానికి తగదు.

– రాజాపు రమణ, మిర్తివలస, సంతకవిటి మండలం

పశువులన్నింటికీ బీమా వర్తింపజేయాలి



రాష్ట్ర విభజన అనంతరం పాడి పశువుల బీమా పథకం అటకెక్కింది. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ మేలుచేకూర్చింది. ఏ పథకం అమలుచేసినా గ్రామ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా అవగాహన కల్పించేవారు. ఇప్పుడు ఈ ఏ పథకం గురించీ రైతులకు తెలియదు. పశుబీమా పథకాన్ని పరిమితం చేయవద్దు.

– బివర త్రినాథరావు, రైతు, వన్నలి, రేగిడి మండలం

18న మెగా జాబ్‌మేళా

- కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, ఎమ్మెల్యే మాధవి

విజయనగరం ఫోర్ట్: నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలోని మిరాకిల్ ఎడ్యుకేషనల్ సొసైటీలో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 18న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. తన చాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో జాబ్ మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే మాధవితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో 29 ప్రముఖ కంపెనీలలో 2,500 పోస్టుల భర్తీ చేస్తారన్నారు. దీనిని 18 నుంచి 36 ఏళ్ల మధ్య వయస్సుగల ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లమా, ఇంజినీరింగ్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నెలకు రూ.12వేల నుంచి రూ.60 వేల వరకు జీతం లభిస్తుందని తెలిపారు. ఎక్కువ ఉద్యోగాలు హైదరాబాద్‌లో కల్పిస్తారన్నారు. ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్‌తో అభ్యర్థులు హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు జేయేష్ సెల్:82971 92497, తరుణ్ సెల్: 80994 61303 నంబర్లను సంప్రదించాలన్నారు.